క్లుప్తంగా

ఘనంగా సినారె జయంతి



సినారె చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వాకర్లు

కాకినాడ రూరల్: జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత సి.నారాయణరెడ్డి జయంతిని శనివారం సర్పవరం జంక్షన్‌లోని బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. విశ్రాంత గ్రంథాలయ అధికారి చింతపల్లి సుబ్బారావు ఆయన సాహితీ సేవలను వివరించారు. ఆయన రాసిన గ్రంథాలు ఇంగ్లిషు, సంస్కృతం, ఫ్రెంచ్, హిందీ, ఉర్దూ, మలయాళం, కన్నడం వంటి భాషల్లోకి అనువాదం అయ్యాయని అన్నారు. అడబాల రత్న ప్రసాద్, రాజా, సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటితో డయేరియా

వాతావరణంలో మార్పు, కలుషిత నీరు, పులిసిన ఆహారం తీసుకోవడం వల్ల డయేరియా వచ్చే అవకాశం ఉందని డాక్టర్ సువర్ణ రాజు పేర్కొన్నారు. డయేరియా నివారణ దినోత్సవాన్ని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

రైతులకు విత్తనాలు ఉచితంగా ఇవ్వాలి

బోట్‌క్లబ్: ప్రభుత్వం రైతులకు ఉచితంగా విత్తనాలు సరఫరా చేయాలని బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు యార్లగడ్డ రామ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. కాకినాడలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల అకాల వర్షాల వల్ల జిల్లాలో పలు గ్రామాల్లో రైతులు ఊడ్చిన వరినాట్లు కొట్టుకుపోయాయన్నారు. జిల్లాలో 30 వేల హెక్టార్లలో వేసిన వరినాట్లు వేశారని, చాలా మండలాల్లో నాలుగైదు రోజులు వరదనీరు పొలాల్లో నిలిచిపోవడంతో వరినాట్లు కుళ్లిపోయాయన్నారు. దీంతో రైతులు మళ్లీ విత్తనాలు చల్లుకోక తప్పదన్నారు.

ఎమ్మెల్యే ద్వారంపూడి పరామర్శ

కాకినాడ: విశ్రాంత తహసీల్దార్ సలీముద్దీన్ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి శనివారం పరామర్శించారు. ఇబ్రహీం వీధిలోని సలీముద్దీన్ నివాసానికి వెళ్లి ఆయన కుటుంబాన్ని ఓదార్చి ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, వక్ఫ్ బోర్డు చైర్మన్ రెహ్మాన్‌ఖాన్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాలిద్ బిన్ వలీ, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ చోటు, మాజీ కార్పొరేటర్ రోకళ్ల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి హనుమాన్ చాలీసా పారాయణ

సామర్లకోట: స్థానిక కన్యకా పరమేశ్వరిరి ఆలయంలో ఆదివారం నుంచి ఆగస్టు ఐదో తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 6 నుంచి సాయంత్రం 5 వరకు హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందని పంచారామ క్షేత్ర ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పెద్దాపురం ధర్మ గీతా ప్రచారకులు మల్లికార్జునస్వామి ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన భక్త మండళ్లచే పారాయణ జరుగుతుందన్నారు. వాసవీ ఉత్సవ కమిటీ, ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం, వాసవీ యూత్ అండ్ ఫ్రెండ్స్, వాసవీ యంగ్ బాయ్స్, వాసవి వనితా క్లబ్, వాసవి కపుల్స్ క్లబ్ భీమేశ్వర సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి రోజు సాయంత్రం 5 నుంచి 6.30 వరకు ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త పోల్నాటి గోవిందరావుచే సుందరకాండ రామాయణంలో హనుమాన్ వైభవం గురించి ప్రవచనాలు చేస్తారని తెలిపారు.

అన్నదాతకు అన్నీ తానై..



కరపలో రైతు పొలంలో ఈ–క్రాప్ నమోదు చేస్తున్న వీఏఏ (ఫైల్)



కరప ఆర్బీకేలో రైతులకు ఈకేవైసీ చేస్తున్న అధికారి (ఫైల్)

- బీమాతో ఆదుకుంటున్న సీఎం జగన్
- ప్రీమియం పూర్తిగా చెల్లిస్తూ సహకారం
- నష్ట నివారణలో అండగా ప్రభుత్వం

కరప: తుపాన్లు, అధిక వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు నష్టపోయే అన్నదాతను ఆదుకునే ఏకైక ఆపద్బంధువు బీమా. గతంలో బ్యాంకులు, పీఏసీఎస్‌లలో పంటరుణాలు తీసుకునే రైతులకు మాత్రమే ఈ అవకాశం ఉండేది. కానీ రైతు బాంధవుడైన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీమా ప్రీమియంను పూర్తిగా తానే రైతుల తరఫున చెల్లిస్తూ పంట నష్ట పరిహారం బీమా రూపంలో ఇప్పిస్తున్నారు.

బీమా మంజూరు కావాలంటే ముందుగా రైతులు ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలి. ఆర్బీకేలో వీఏఏ తన లాగిన్‌లో రైతుపేరు, గ్రామం, సర్వే నంబరు, విస్తీర్ణం, వేసిన పంట, బ్యాంక్ అకౌంట్, ఆధార్ నంబరు వంటి వివరాలతో ఈ–క్రాప్ నమోదుచేస్తారు. రైతు తన వివరాలతో పాటు కంప్యూటర్‌లో ఈకేవైసీ చేయించుకోవాలి. ఆ తర్వాత సంబంధిత వీఆర్వో ధ్రువపరచాలి.

బీమా వచ్చేదిలా..

గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని బీమా వర్తింపజేస్తారు. కంప్యూటర్ ద్వారా ఆ గ్రామంలో ర్యాండమ్‌గా నాలుగు సర్వే నంబర్లు ఎంపిక చేసి, వ్యవసాయశాఖకు తెలియజేస్తారు. గ్రామంలో ఏయే సర్వే నంబర్లలో పంటకోత ప్రయోగాలు చేయాలో సమాచారం వచ్చిన తర్వాత పంట కోతకు వచ్చిన వెంటనే ఆయా ప్రాంతాలలో 5/5 (అడుగులు) విస్తీర్ణంలో పంటకోసి, వచ్చిన ధాన్యం బరువు తూచి, తేమ శాతం తీసి ఒక ఎకరాకు ఎన్ని బస్తాలు (75కిలోలు) దిగుబడి వస్తుందో లెక్క కడతారు. నాలుగుచోట్ల వచ్చిన సరాసరి దిగుబడిని యాప్‌లో రైతు పేరున నమోదు చేస్తారు. మండల పరిధిలో గ్రామాల వారీగా వచ్చిన దిగుబడిని కలెక్టరేట్‌లోని గణాంక శాఖకు, అక్కడనుంచి ప్రభుత్వానికి నివేదిస్తారు. పంట దిగుబడి రావాల్సిన సగటుకంటే తక్కువగా వస్తేనే పంటల బీమా వస్తుంది. ఏయే గ్రామాల్లో సగటుకంటే ఎంతమేర దిగుబడులు తగ్గాయో లెక్కకట్టి, ఒక ఎకరానికి మంజూరుచేయాల్సిన బీమా శాతాన్ని నిర్ణయిస్తారు.

> **కరప మండలంలో 16,321 మందికి ప్రయోజనం**
>
> 
>
> కరప మండలంలో 14,400 ఎకరాల్లో వరి సాగు చేస్తారు. 16,321 మంది రైతులు ఉన్నారు. వీరిలో సన్నకారు రైతులు 10,375 మంది, చిన్నకారు రైతులు 4,595 మంది, పెద్ద రైతులు 1351 మంది ఉన్నారు. వీరిలో ఎస్సీ రైతులు 417 మంది, ఎస్టీ రైతులు 38 మంది, బీసీ రైతులు 5525 మంది, ఇతరులు 10,341 మంది రైతులు ఉన్నారు. ఉచిత పంటల బీమా వర్తింపచేసేందుకు ఏటా ఆగస్టు నెలాఖరులోగా వీఏఏల ద్వారా ఈక్రాప్‌నమోదు, ఈకేవైసీ చేయిస్తున్నాం.
>
> – ఏవీ రాజేష్,
> కరప మండల వ్యవసాయాధికారి.

లాన్ టెన్నిస్‌లో రోహిత్‌కు స్వర్ణం



ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి లాన్ టెన్నిస్ పోటీలలో బంగారు పతకం సాధించిన రోహిత్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 21 నుంచి 27 వరకు జరిగిన జాతీయస్థాయి లాన్‌టెన్నిస్ పోటీల్లో కాకినాడకు చెందిన దుంపల రోహిత్ అండర్–14 విభాగంలో స్వర్ణ పతకం సాధించాడు. స్థానిక శ్రీనగర్ కార్పొరేషన్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. ఢిల్లీలో జరిగిన పోటీలలో పాల్గొనడానికి రోహిత్‌కు సేవ్‌ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యం అందించారు. రోహిత్‌ను శిక్షకుడు టాడ్, పాఠశాల హెచ్‌ఎం మహ్మద్ రబ్బాని శనివారం అభినందించారు.

మణిపూర్ ఘటనలపై పెల్లుబికిన నిరసన



కరపలో నిర్వహిస్తున్న శాంతి ర్యాలీ



మహిళల పోరు యాత్ర వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు

కరప: మణిపూర్‌లో మహిళలపై జరిగిన హింసాత్మక దాడులు, అత్యాచారాలను ఖండిస్తూ మండల అంబేడ్కర్ యువజన సేవాసంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కరపలో శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. మండల ఎస్సీ నాయకులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, ప్రజా సంఘాల నాయకులు కరప చేరుకుని, పీహెచ్‌సీకి ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. దళిత నాయకుడు, రచయిత సవిలే రాజేష్ మాట్లాడుతూ ఆయా ఘటనల్లో దోషులను కేంద్ర ప్రభుత్వం పట్టుకుని ఉరి శిక్ష వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్సై ఎస్.రామకృష్ణ, తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ పేపకాయల మాచరావుకు వినతి పత్రం సమర్పించారు. వేళంగి సర్పంచ్ సవిలే నీలిమ, మండల అంబేడ్కర్ యువజనసేవాసంఘం అధ్యక్షుడు చిన్నం వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మూరా అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల పోరు యాత్ర పోస్టర్ల ఆవిష్కరణ

కాకినాడ సిటీ: దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఐద్వా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న హింసపై మహిళల పోరు యాత్ర జయప్రదం చేయాలని కాకినాడ ఐద్వా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు భూలక్ష్మి, కె.నాగజ్యోతి పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ఐద్వా నగర కమిటీ పోస్టర్లను శనివారం ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడారు. ఈ పోరు యాత్ర విశాఖపట్నం నుంచి ఈ నెల 28న బయలుదేరుతుందని ఈ యాత్ర తుని, పిఠాపురం మీదుగా ఆగస్టు 1వ తేదీన కాకినాడకు చేరుతుందన్నారు. వచ్చేనెల 8న విజయవాడ చేరుకుంటుందన్నారు. అనంతరం బహిరంగ సభతో ముగుస్తుందన్నారు. ఆ రోజు మహిళలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని యాత్రను జయప్రదం చేయాలని కోరారు. హింసను ప్రేరేపించే మద్యం నిషేధించాలని, మాదక ద్రవ్యాలు అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అమానుష సంఘటనలు అరికట్టాలని, దోషులను తక్షణమే శిక్షించాలని, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు భవాని, కుమారి పలువురు పాల్గొన్నారు.

నేడు కవి సమ్మేళనం

కాకినాడ కల్చరల్: సాహితీ స్రవంతి, యూటీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కచేరిపేట యూటీఎఫ్ హోమ్ సమావేశపు మందిరంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు మణిపూర్ మారణకాండపై 'జనక వనం' పేరుతో కవి సమ్మేళనం నిర్వహించనున్నట్టు స్రవంతి నగరశాఖ అధ్యక్షులు మార్ని జానకీరామ్‌చౌదర్ తెలిపారు. కవులు, రచయితలు సమ్మేళనంలో పాల్గొని సామాన్య ప్రజలను మణిపూర్ ఘటనపై చైతన్యవంతులను చేయాలని మార్ని కోరారు.

విశ్వేశ్వరునికి లక్ష బిల్వార్చన

తాళ్లరేవు: అధిక శ్రావణమాసం పవిత్ర ఏకాదశి పర్వదినం సందర్భంగా పిల్లంక– బ్రహ్మపురి సరిహద్దులోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామివారికి శనివారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. వేద పండితులు వేలూరి వెంకట కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో రామచంద్రపురం, వెంటూరు మాస శివ రాత్రి కమిటీకి చెందిన సుమారు 60 బ్రాహ్మణ కుటుంబాల సభ్యులు లోక కల్యాణార్థం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరునికి లక్ష పత్రిపూజ, అన్నపూర్ణాదేవికి లక్ష కుంకుమార్చన భక్తి శ్రద్ధలతో చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం, ప్రసాద వితరణ చేశారు.

సొసైటీ గోదాము నేడు ప్రారంభం

సామర్లకోట: మండల పరిధిలో పీబీ దేవం గ్రామంలో రూ.13 లక్షలతో నిర్మించిన సొసైటీ గోదాములను ఆదివారం ప్రారంభిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు మలకల వరాలబాబు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సొసైటీ కార్యకలాలు అభివృద్ధిలో భాగంగా త్వరలో కిరణా సరకులు విక్రయించనున్నట్టు చెప్పారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

కొత్తపల్లి: కిరాణా దుకాణంలో చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు స్థానిక పోలీసులు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే..మండలంలోని ఉప్పాడ మెయిన్‌రోడ్డులో ఉన్న సాయికృష్ణ కిరాణా దుకాణంలో ఈ నెల 19న చోరీ జరిగింది. యజమాని సఖినాల కృష్ణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై రామలింగేశ్వరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దుకాణంలో ఉన్న రూ.12,500ను పిఠాపురానికి చెందిన కాకి అనిల్‌కుమార్ చోరీ చేసినట్టు గుర్తించి అతడిని అరెస్టు చేశారు. నిందితుడిని పిఠాపురం కోర్టులో హాజరు పరిచినట్టు పోలీసులు తెలిపారు.

జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడిగా చిన్న



నూతన కమిటీని అభినందిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

కాకినాడ సిటీ: జిల్లా రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడిగా సీహెచ్ చిన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఏపీజేఏసీ అమరావతి ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఏపీఆర్ఎస్ఏ రెవెన్యూ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారుల సంఘం ఎన్నికలు ఏపీ ఆర్ఎస్ఏ రాష్ట్ర నాయకులు కె.చంద్రశేఖర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రామమోహన్, ఏపీ అమరావతి జేఏసీ వైస్ చైర్మన్ కె.శ్రీనివాసరావు ఈ ఎన్నికల అధికారులుగా వ్యవహరించి ఎన్నికలను నిర్వహించారు. సహాధ్యక్షుడిగా ఎస్‌వీకేటీ సాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జీవీ సూరిబాబు, ఉపాధ్యక్షుడిగా పరమేశ్వరరాజు, ఎస్.సత్యనారాయణ, యు.నాగవేణి, కోశాధికారిగా బి.భాగయ్యలతో పాటు మరో 25 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో స్కేటింగ్ రింక్



స్కేటింగ్ రింక్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: స్మార్ట్ సిటీ నిర్మాణంలో భాగంగా అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందుతున్న స్కేటింగ్ రింక్ పనులను ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి శనివారం సందర్శించారు. స్థానిక వివేకానంద పార్కు ఆవరణలో నిర్మాణంలో రింక్ ప్రగతిని అక్కడ ఉన్న అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను మరింత వేగవంతం చేసి త్వరలోనే వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కేటింగ్ క్రీడను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్కేటింగ్‌పై ఆసక్తి కలిగిన వారిని మరింత ప్రోత్సహించేందుకు, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలు నిర్వహించేందుకు వీలుగా ఇక్కడ రింక్ నిర్మాణం అవుతుందన్నారు. స్కేటింగ్ రింక్ నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆయన కోరారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, కన్వీనర్లు, గృహ సారథుల సభ్యులు సుంకర సాగర్, డీఈ రామారావు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

శృంగార వల్లభుని దర్శనానికి భక్తుల రద్దీ



భక్తుల నుంచి పూజలందుకుంటున్న తిరుపతి శృంగారవల్లభ స్వామి



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దాపురం: మండలంలోని తిరుపతి శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తుల రద్దీ పెరిగింది. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. ఆలయ టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామికి 4,52,814 రూపాయలు ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన నూతన దంపతులకు, దాతలకు ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమచార్యులు, నారాయణాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు శేష వస్త్రంతో సత్కరించి స్వామి వారి చిత్రపటాలను అందజేశారు. సుమారు ఆరు వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

ధ్యానంతో మానసికోల్లాసం



ధ్యానం చేస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి: ధ్యానం చేయడం ద్వారా మనస్సుకు ఆహ్లాదం (మానసికోల్లాసం) కలుగుతుందని దుర్గా ప్రసాద్ బన్వర్‌లాల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సరిత అగర్వాల్ అన్నారు. పిఠాపురం పట్టణంలోని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠంలో నూతనంగా నిర్మించిన ఆశ్రమాన్ని హైదరాబాద్‌కు చెందిన దుర్గా ప్రసాద్ బన్వర్‌లాల్ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు, ప్రిన్సిపాల్‌తో కలిసి శనివారం సందర్శించారు. పీఠం విశిష్టతను విద్యార్థులకు పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు వివరించారు. ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను తెలియజేశారు. అనంతరం ధ్యానం చేశారు. కార్యక్రమంలో జీవనది ఫౌండేషన్ అధ్యక్షురాలు దుర్గా మహాలక్ష్మి, కుమార్, చంటి తదితరులు పాల్గొన్నారు.

న్యాయంగా నిలబడేలా

- ప్రాక్టీస్ కాలంలో న్యాయవాదులకు భరోసా
- జూనియర్లకు నెలకు రూ.5వేల స్టైఫండ్
- హామీ నిలబెట్టుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

కాకినాడ లీగల్: దేశంలో మరే రాష్ట్రంలోనూ లేని విధంగా యువ న్యాయవాదులు ఆర్థికంగా వృత్తిలో నిలదొక్కుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి 'వైఎస్సార్ లా నేస్తం' యువ న్యాయవాదులకు అండగా నిలుస్తోంది. వృత్తిలో ప్రవేశించిన యువ న్యాయవాదులు తొలి మూడేళ్లు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఈ పథకాన్ని సీఎం రూపొందించారు. వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లుగా వైఎస్సార్ లా నేస్తంను అందిస్తున్నారు. జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించిన ప్రతి ఒక్కరికి ప్రతి నెలా రూ.5 వేలు స్టైఫండ్ అందిస్తున్నారు. గత ప్రభుత్వాల సమయంలో డిగ్రీ చదివి న్యాయవాద వృత్తిపై మక్కువతో లా చదివిన తరువాత యువ న్యాయవాదులకు సరైన ప్రోత్సాహం, ఆర్థిక భరోసా లేక పోవడంతో ప్రాక్టీస్ వదిలి చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుని జీవించేవారు. జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో న్యాయవాదుల సమస్యలు తెలుసుకుని వారికి ఆర్థికంగా భరోసా కల్పించేందుకు హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగా ముఖ్యమంత్రి అయిన వెంటనే 'వైఎస్సార్ లా నేస్తం' పథకాన్ని అమలులోకి తీసుకు వచ్చి ప్రతి అర్హత కలిగిన జూనియర్ న్యాయవాది ఆర్థిక ఇబ్బంది పడకుండా ఉండేందుకు నెలకు ఐదువేల రూపాయల చొప్పున సంవత్సరానికి రూ.60 వేలు అందించే ఏర్పాట్లు చేశారు. మూడేళ్ల కాలానికి రూ.1.8 లక్షలు అందిస్తున్నారు. ఇటీవల వైఎస్ఆర్ లా నేస్తం ద్వారా 198 మంది జూనియర్ న్యాయవాదులకు రూ.49.5 లక్షలు స్టైఫండ్‌గా సీఎం జగన్ విడుదల చేశారు.

నైపుణ్యాలకు పెద్దపీట



జూనియర్ న్యాయవాదులు సీనియర్ల వద్ద శిక్షణ పొందుతూ లా ఆఫీస్ కోసం, ఇతర పోటీ పరీక్షలకు పుస్తకాలు ఉన్నత కోర్సుల్లో శిక్షణకు ప్రభుత్వం ఇచ్చే స్టైఫండ్ ఉపయోగపడుతుంది. న్యాయవాదుల సమస్యలు గుర్తించిన సీఎం జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు.

– మారిశెట్టి హేమ వెంకట అంజలి, కాకినాడ

భవితకు భరోసా



జగనన్న మేలు మరువలేము. ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వమూ ఈ నిర్ణయం తీసుకోలేదు. స్టైఫండ్ మా లాంటి మహిళా జూనియర్ న్యాయవాదుల భవిష్యత్‌కు భరోసాగా నిలుస్తోంది. మేము శిక్షణ పొందుతూ ఉన్నత స్థాయికి వెళ్లేందుకు ఉపయోగపడుతుంది. వృత్తిలో ఉన్నత స్థాయికి వెళ్లేందుకు దోహదపడుతుంది.

– కొజ్జవరపు పావని సుధ, కాకినాడ

జూనియర్ లాయర్లకు వరం



నెలకు రూ.5 వేల స్టైఫండ్ సీఎం మాకిచ్చిన వరం. ప్రాక్టీస్ చేసే సమయంలో ఆర్థిక తోడ్పాటు లేక ఎంతోమంది ప్రాక్టీస్ మధ్యలోనే తిరిగి ఇతర వృత్తిలోకి వెళ్లిపోతున్నారు. ఓ సీనియర్ న్యాయవాది వద్ద జూనియర్ లాయర్‌గా ప్రాక్టీస్ చేస్తున్నాను. అన్ని వర్గాలతో పాటు, జూనియర్ లాయర్లకు స్టైఫండ్ ఇవ్వడం ఎంతో ప్రోత్సాహకంగా ఉంది. చాలా ఆనందంగా ఉంది.

– బత్తుల నరేష్, కాకినాడ


ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు



ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్ని ఆర్థిక ఒడిదొడుకులు ఉన్నా క్రమం తప్పకుండా 'లా నేస్తం' అమలు చేయడానికి చర్యలు తీసుకోవడంతో సీఎం జగన్ చరిత్రలో నిలిచిపోతారు. కొత్తగా లా చదువుకుని ప్రాక్టీసు మొదలు పెట్టిన సమయంలో చాలా ఒడిదొడుకులకు గురవుతుంటాం. చాలా కొద్ది మందికి మాత్రమే ఆదాయం వస్తుంది. అలాంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి జూనియర్ లాయర్లకు భరోసా కల్పిస్తూ ఆర్థిక సాయాన్ని అందించడం చాలా ఆనందంగా ఉంది.

– నిమ్మలగడ్డ మహాలక్ష్మి, కాకినాడ

రూ.వంద కోట్లతో ట్రస్ట్ హర్షణీయం



పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం జగన్ న్యాయవాదుల సంక్షేమానికి రూ.100 కోట్లతో వెల్ఫేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. మెడిక్లెయిమ్, న్యాయవాదుల అవసరాలకు, రుణాల వంటి వాటికి ఈ ఫండ్ నుంచి రూ.25 కోట్లు సాయం చేశారు. అలాగే జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5వేలు స్టైఫండ్ కల్పించడం చాలా మంది జూనియర్లకు ఆర్థిక తోడ్పాటునిస్తోంది.

– ముత్తింటి విశ్వేశ్వరరావు, అధ్యక్షుడు, కాకినాడ బార్ అసోసియేషన్

యానాం టు తాడేపల్లి

అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తితో తాళ్లరేవు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు

తాళ్లరేవు: యానాం నుంచి గుంటూరు జిల్లా తాడేపల్లికి మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని శనివారం తాళ్లరేవు ఎస్ఈబీ పోలీసులు అరెస్ట్ చేశారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ జేవీ భవాని తెలిపిన వివరాల మేరకు అడిషనల్ ఎస్పీ ప్రేమ్ కాజల్ ఆధ్వర్యంలో యానాం–ఆంధ్రా సరిహద్దు ప్రాంతమైన సుంకరపాలెంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా టాటా ఇంట్రా వ్యానులో తరలిస్తున్న 30 మద్యం సీసాలను సీజ్ చేశామన్నారు. మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న తాడేపల్లి మండలానికి చెందిన సంగన బాలకృష్ణారెడ్డిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించడంతో పాటు వ్యానును సీజ్ చేశామని సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐ ఎంవీవీబీ కుమార్, కానిస్టేబుల్స్ వీరభద్రరావు, డి.శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కేశవస్వామికి ఏకాదశ పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ, భూ సమేత కేశవస్వామి

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు కేశవపురంలో ఉన్న శ్రీదేవీ, భూదేవీ సమేత కేశవస్వామివారికి ఏకాదశ పూజలు నిర్వహించారు. పవిత్ర ఏకాదశి శనివారం పర్వదినాన్ని పురస్కరించుకుని అర్చకులు శ్రవణ్‌కుమార్ స్వామివారికి పంచామృతాభిషేకం, అర్చన, బాలభోగం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొల్లు శ్రీను, ఎంపీటీసీ సభ్యులు రత్న ముత్యాలు, నందికోళ్ల శ్రీదేవి, నాయకులు బి.శ్రీనివాసరెడ్డి, చిట్టూరి చలపతి తదితరులు పాల్గొన్నారు.